క్లుప్తంగా

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

నాగాయలంక: అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక బుధవారం నాగాయలంక మండలంలో పర్యటిస్తారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యాలయ వర్గాలు, నంగేగడ్డ సర్పంచి తోట లంకమ్మ మంగళవారం తెలిపారు. నంగేగడ్డ గ్రామంలో రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనం, గడపకు గడపకు మన ప్రభుత్వం–ఇతర నిధులు రూ.69 లక్షలతో నిర్మించిన 8 సిమెంట్ రోడ్లను చైర్‌పర్సన్‌తో కలిసి ఎమ్మెల్యే ఉదయం 10.00 గంటలకు ప్రారంభిస్తారని వివరించారు.

గిరిజన కుటుంబాలకు వస్త్ర దానం



గణపేశ్వరం(నాగాయలంక): పంచాయతీ పరిధిలోని దిండి గ్రామంలో 20 ఎస్టీ(యానాది) కుటుంబాలకు మండల గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధి పరసా శ్రీనివాసరావు, సాయి లీల దంపతులు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో వినాయక ఉత్సవాలు జరుగుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని మంగళవారం వారికి వీటిని పండుగ బహుమతిగా ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు.

లబ్ధిదారులకు నూతన పింఛన్ల పంపిణీ



కోనేరుసెంటర్: ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. సీతారాంపురం, ఎస్ఎన్ గొల్లపాలెం, సుల్తానగరం, అరిసేపల్లి, పొట్లపాలెం, పోతిరెడ్డి పాలెం, గరాల దిబ్బ తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పెన్షన్లను మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో బందరు ఎంపీడీఓ బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ ఇన్‌చార్జీలు, నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



కోనేరుసెంటర్: చందర్లపాడు పోలీస్ స్టేషన్‌లో జీబు డ్రైవర్‌గా పనిచేస్తూ గత నెల గుండె పోటుతో మరణించిన హోంగార్డు కత్తి చిన్న వెంకటయ్య కుటుంబానికి హోంగార్డ్స్ వన్డే కాంట్రిబ్యూషన్‌గా సేకరించిన రూ. 3,91,210 చెక్కును ఆయన సతీమణి కత్తి సౌమ్యకి జిల్లా ఎస్పీ పి.జాషువా మంగళవారం ఆయన కార్యాలయంలో అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ చనిపోయిన హోంగార్డ్ కత్తి చిన వెంకటయ్య కుటుంబానికి ఎప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా నేరుగా అధికారులను కలువవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి నుంచి వీక్లీ ఆరోగ్య మేళా

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బుధవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు వీక్లీ ఆరోగ్య మేళా కార్యక్రమం జరుగుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ జయకుమార్ తెలిపారు. ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో పలు విభాగాల వైద్య నిపుణులు పాల్గొంటారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుమార్తెతో సహా తల్లి అదృశ్యం

కోడూరు: దేవాలయానికి వెళ్లొస్తానంటూ ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వివాహిత కుమార్తెతో సహా అదృశ్యమైంది. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నరసింహపురం గ్రామానికి చెందిన కోటపాటి కావ్య ఈ నెల 16న కోడూరులోని వెంకటేశ్వర స్వామి వారి దేవాలయానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పింది. గుడికి వెళ్లేందుకు అవసరమైన సామగ్రితో పాటు ఆరేళ్ల కుమార్తెను తనతో పాటు బయటకు తీసుకువెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో భర్త శ్రీనివాసరావు కావ్య పుట్టింటి వారికి సమాచారం ఇవ్వడంతో పాటు ఇరుగు పొరుగు వారు, స్నేహితుల ఇళ్ల వద్ద విచారణ చేశాడు. అయినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊరూవాడా చవితి సందడి

- ఇంటింటా వినాయక చవితి వేడుకలు
- గణనాథుడికి విశేష పూజలు
- వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్న ప్రతిమలు

కోడూరు: వినాయక చవితి వేడుకలు అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ఊరూవాడా ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, సెంటర్లలో భారీ గణనాథుల విగ్రహాలు నెలకొల్పి ప్రత్యేక పూజలు జరిపించారు. ఇంటింటా వినాయకుడికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కోడూరులోని శ్రీ ప్రసన్న గణపతి ఆలయం వద్ద ప్రత్యేక పందిరిలో సిద్ధిబుద్ధి సమేత గణనాథుడి కల్యాణాన్ని కనుల పండువగా జరిపారు. ఆలయ ప్రాంగణమంతా వివిధ రకాల తోరణాలు, పండ్లతో ముస్తాబుచేశారు. నరసింహపురం రామాలయం వద్ద లంబోదరుడి విగ్రహాన్ని నెలకొల్పి మహిళలు పూజలు చేశారు. కుడుములు, ఉండ్రాళ్లు, గారెలను నైవేద్యంగా సమర్పించారు. విశ్వనాథపల్లి, లింగారెడ్డిపాలెం, మెరకగౌడపాలెం, ఉల్లిపాలెం, నక్కవానిదారి, వి.కొత్తపాలెం, పిట్టల్లంక, ఇస్మాయిల్‌బేగ్‌పేట, మాచవరం గ్రామాల్లో భారీ గణనాథుల విగ్రహాలను నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటి వద్ద చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉత్సవ, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బంటుమిల్లి: స్థానిక సిద్ధి, బుద్ధి సమేత వినాయక గుడి వద్ద విజయ గణపతి మోటారు సైకిల్ వర్కర్స్, ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, సంత బజారులో కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. వీరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిళ్లలో విగ్రహాలను సమర్పించేందుకు దాతలు పోటీ పడ్డారు. మండలంలోని గ్రామాల్లో చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

బాలలచే వినాయక వ్రతం, సరస్వతీ పూజ

నాగాయలంక: స్థానిక ప్రసన్న గణపతి దేవస్థానం 66వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా తొలిరోజు సోమవారం ఉత్సవ పందిరిలో 250 మంది బాలబాలకలచే సామూహిక వరసిద్ధి వినాయక వ్రతం, సరస్వతీ దేవి పూజ బ్రహ్మశ్రీ అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ చిట్టా సాంబశివరావు వ్రతం, పూజలో కూర్చున్న బాలలందరికి నోట్ పుస్తకాలు, పెన్నులు బహూకరించారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ శ్రీనివాస్, కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.



బందరు 34వ డివిజన్‌లో గణనాథుని దర్శించుకున్న పేర్ని కిట్టు



కప్పలదొడ్డిలో గణనాథుడికి పూజలు నిర్వహిస్తున్న జోగి రాజీవ్



చిన్నారులకు పుస్తకాలు అందించిన డీఎస్పీ, సీఐ, ఆర్యవైశ్య సంఘం నేతలు

మోపిదేవి: మండలంలో ప్రముఖ దేవాలయాలతో పాటు ప్రధాన కూడళ్లలో వినాయక విగ్రహాలను నెలకొల్పి పూజలు చేశారు. మోపిదేవి వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నెలకొల్పిన మట్టి గణనాథుని విగ్రహానికి ఆలయ ఏసీ ఎన్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు బుద్ధు పవన్‌కుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోపిదేవి గొల్లపాలెంలో నెలకొల్పిన గణేశుని విగ్రహం వద్ద మంగళవారం అన్నసమారాధన జరిగింది.

నాగాయలంకలో..

నాగాయలంక: గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 66వ వార్షిక వినాయక నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అవనిగడ్డ డీఎస్పీ డి.మురళీధర్, సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐ ఎం. సుబ్రహ్మణ్యం ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. ఆశీల పాటదారులు చందన వాసు, చందన సుబ్బారావు 12 అడుగుల వినాయకుని విగ్రహాన్ని సమర్పించారు. తొలుత దేవస్థానంలో ఆలయ అర్చకుడు అంబా సాయికిరణ్‌శర్మ నేతృత్వంలో ప్రసన్నగణపతి స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణ జరిపారు. ఉత్సవాలు అక్టోబర్ 4వ తేదీ వరకు జరుగుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. రెండో రోజు మంగళవారం చిట్టా వాణి, చిట్టా సావిత్రి నేతృత్వంలోని సంకర్షణ భజన మండలి మహిళలచే విఘ్నేశ్వర, శ్రీలక్ష్మీ సహస్ర నామ పారాయణ జరిగింది. ఆలయంలో చిట్టా మల్లికార్జునరావు, దేవి దంపతులచే ప్రసన్న గణపతి పూజ నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు లంకె వెంకట స్వామి భాగవతార్‌చే హరికథా గానం జరిగింది.

పెడన: పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలు, కూడళ్లలోను వినాయకుని చవితి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. వివిధ రకాల గణనాథుల ప్రతిమలను పెట్టి పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం కొందరు నిమజ్జనం చేయగా మరికొందరు తమ వినాయకుని ప్రతిమలను పక్కకు జరిపి మంగళవారం నిమజ్జనం చేశారు. మంగళవారం మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ పట్టణంలో పలు వార్డులలో ఏర్పాటు చేసిన వినాయకుని ప్రతిమల వద్దకు వెళ్లి నిర్వాహకులను కలిసి అభినందనలు తెలిపారు. పలు చోట్ల వినాయకుని పూజించి ఆశీర్వచనాలు పొందారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండీ ఖాజా, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మల్లి, కౌన్సిలర్లు జయేష్, మెట్ల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాజుపేటలో లక్ష్మీ గణపతి స్వామి వారి ఆలయం వద్ద 36వ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కాణిపాకంలోని వినాయకుని ఆకృతిలో 15 అడుగుల మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహానికి ఇరువైపులా చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1 రాకెట్ల నమూనాలను ఉంచారు. నగరంలోని పలు ప్రాంతాల్లో వినాయకుని ప్రతిమలు పెట్టి పందిళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నగరంలోని 34వ డివిజన్ బ్రహ్మంగారి గుడి సమీపంలో ఏర్పాటు చేసిన నవరాత్రి పందిరిలో గణనాథుని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. 34వ డివిజన్ ఇన్‌చార్జి బడే భానుతేజ, నాయకులు సుంకర రాఘవరావు, పత్తిపాటి ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: వినాయక చవితిని పర్వదినాన్ని గూడూరు మండలంలో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పందిళ్లలో గణనాథులు కొలువు దీరారు. ఉదయం, సాయంత్రం బొజ్జగణపతికి పూజలు నిర్వహిస్తుండటంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. కప్పలదొడ్డిలో మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ మంగళవారం గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



బంటుమిల్లిలో పూజలు అందుకుంటున్న గణనాథుడు



నాగాయలంకలో ప్రసన్న గణపతి ఉత్సవాలను ప్రారంభించిన డీఎస్పీ తదితరులు



పెడన వైఎస్సార్ కాలనీలో వినాయకుని వద్ద పూజలు చేస్తున్న భక్తులు



పెడన మఠం వీధిలో వినాయకుని వద్ద దంపతుల పూజలు

కృత్తివెన్ను: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం మండల వ్యాప్తంగా భక్తులు విఘ్నేశ్వరస్వామికి పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరస్వామి ఆలయాలతో పాటు ప్రధాన కూడళ్లు, ఇతర ఆలయాల్లోనూ వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

లక్ష్మీగణపతికి ఎమ్మెల్యే సింహాద్రి పూజలు


అవనిగడ్డ: స్థానిక ఆరో వార్డులో ప్రధాన రహదారి పక్కన 12వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక పందిరిలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. వినాయక పందిరిలోని లక్ష్మీ గణపతి విగ్రహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే సింహాద్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, లంకమ్మ అమ్మవారి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ చింతలపూడి బాల భాస్కరరావు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో గణనాథునికి పూజలు



గాంధీనగరంలో పూజలందుకుంటున్న వినాయకుడు



బందరు రాజుపేటలో కాణిపాకం వినాయకుని ఆకృతిలో గణనాథుడు



విశ్వనాథపల్లిలో భారీ లంబోదరుడు



నరసింహాపురంలో గణనాథుడి విగ్రహం

అభివృద్ధికి బాటలు వేస్తున్న ఎంపీ బాలశౌరి

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. మచిలీపట్నంలోని పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు ఎంపీ బాలశౌరి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గరికపాటి శివ, రొండి కృష్ణ, మాదివాడ రాము, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్‌సీఎం చర్చిలోని స్నేహాలయం వృద్ధాశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేయించారు.

కోడూరు: స్థానిక ప్రధాన సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు భారీ కేక్ కట్ చేసి బాలశౌరికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కోడూరు పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ పూతబోయిన కరుణకుమార్ ఆధ్వర్యంలో 100 మంది ఎస్టీ కుటుంబాలకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ యాదవ రెడ్డి వెంకటసత్యన్నారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలోని పలు గ్రామాలల్లో ఎంపీ వల్లభనేని బాలశౌరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోసూరువారిపాలెంలో కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సర్పంచ్ కోసూరు అనూష, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



బందరులో స్నేహాలయం ఆశ్రమంలో వృద్ధులతో కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

బ్యాంకు అభివృద్ధిలో భాగస్వాములవుదాం

కేడీసీసీబీ చైర్‌పర్సన్ పద్మావతి



కేక్ కట్ చేస్తున్న పద్మావతి. చిత్రంలో బ్యాంక్ అధికారులు, సిబ్బంది

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ వ్యాపారాభివృద్ధిలో మనమంతా భాగస్వాములు కావాలని చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. బ్యాంక్ ప్రధాన కార్యాలయంలోని సమావేశపుహాల్‌లో పద్మావతి జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఆమె కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ బ్యాంక్ సేవలను వివరించారు. అనంతరం ఈడేపల్లి జట్టి నరసింహం వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాతినేని వెంకట కోటేశ్వరరావు (టీకేఆర్), పాలకవర్గ సభ్యులు గడిదేశి పెదవెంకయ్య, భూక్యా రాణి, రవీంద్రరాణా, బ్యాంక్ సీఈఓ ఎ. శ్యామ్‌మనోహర్, జనరల్ మేనేజర్ చంద్రశేఖర్, సహకార బ్యాంక్ ఉద్యోగ సంఘ నాయకులు భోగాది శ్యామ్ పాల్గొన్నారు.

మంచి చేస్తున్నాం.. మద్దతుగా నిలవండి

మంత్రి జోగి రమేష్

పెడన: దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సేవ చేస్తున్నారని, ఈ విషయం అందరికి తెలిసినా మరింత తెలిసేలా చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్‌లో పెడన నియోజకవర్గంలోని బూత్ స్థాయి ఏజెంట్లతో విస్తృత సమావేశాన్ని నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే పకడ్బందీగా అడుగులు ముందుకు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఓటరును కలిసి వైఎస్సార్ సీపీలోని జగనన్న చేసిన మంచిని వారికి వివరించడమే కాకుండా తప్పనిసరిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరాలని సూచించారు. జిల్లా, మండల, డివిజన్ స్థాయిలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు బూత్ ఏజెంట్లకు అందుబాటులో ఉండాలని, ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేయాలని సూచించారు. కొత్తగా ఎవరైనా ఓటు హక్కు పొందాలనుకునే వారికి కూడా మార్గదర్శకంగా ఉంటూ వారిని సంబంధిత అధికారుల వద్దకు తీసుకువెళ్లి ఓటు హక్కు కోసం దరఖాస్తు చేయించాలని సూచించారు. గృహ సారథులు కూడా పూర్తిగా తమ పరిధిలోని ఓటరు గురించి అవగాహన చేసుకోవాలని సూచించారు. సమావేశంలో యువ నాయకుడు జోగి రాజీవ్, పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, ఎంపీపీలు మధుసూదనరావు, చినబాబు, జెడ్పీటీసీలు సురేష్‌రంగబాబు, రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్లు నాగబాబు, పెదబాబు, వెంకట్రాజు, బందారు మల్లి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ తలుపుల కృష్ణ, మాజీ ఎంపీపీ అచ్యుతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

లక్ష్మీపురం(చల్లపల్లి): సంక్షేమ పథకాలతో పేదల జీవన ప్రమాణం పెరిగి పేదరిక నిర్మూలన జరుగుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం సాయంత్రం లక్ష్మీపురం గ్రామ సచివాలయం–3 పరిధిలోని రామానగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే రమేష్ బాబు ఇంటింటికీ వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసి ఎన్నికల్లో ప్రజలను ఓట్లడిగే సత్తా తమకు ఉందన్నారు. పవన్ కల్యాణ్ మాత్రం కాపులను రెచ్చగొట్టి చంద్రబాబును గెలిపించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో విస్తత ప్రజాదరణతో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఏపీ ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ దిల్‌షాద్ నజరానా, అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, లక్ష్మీపురం సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ శీరం వెంకట సత్యనారాయణ (నాని), ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, మంగళాపురం సర్పంచ్ డొక్కు నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

లక్ష్మీపురం(చల్లపల్లి): లక్ష్మీపురం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు దాతలు వస్త్రదానం చేశారు. మంగళవారం స్థానిక రామానగరం తోటలో బడే రామాంజనేయులు–మౌనిక దంపతులు పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది 22 మందికి రూ.18 వేల విలువైన నూతన వస్త్రాలు బహూకరించారు. సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, యాసం నాంచారయ్య పాల్గొన్నారు.

రజకులను కించపరిస్తే సహించేది లేదు

కోడూరు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ బెంగళూరులో ఐటీ ఉద్యోగులు చేపట్టిన నిరసనలో ఓ ఐటీ మహిళా ఉద్యోగి రజకులను కించపరిచేలా మాట్లాడటంపై రజక, బీసీ సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. పురాణాల్లో సామెతల పేరుతో ఐటీ ఉద్యోగి రజకులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడంపై సంఘాల నేతలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రజకుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడిన మహిళపై కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. బీసీ సేన మండల అధ్యక్షుడు కొండవీటి సురేష్, సంఘాల నేతలు అద్దంకి పాండురంగారావు, అద్దంకి కృష్ణ, రామాను రామోహనరావు, లంకే భాస్కరరావు, తిరుపతి వీరాంజనేయులు, ఓలేటి ఆంజనేయులు, కొండవీటి రామకృష్ణ, అవనిగడ్డ శ్రీనివాసరావు, పాగోలు వెంకటప్రసాద్, కోడూరు దుర్గారావు, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు

నాగాయలంక: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ గ్రౌండ్స్‌లో మంగళవారం ఏడు మండలాలు (నియోజక వర్గం) స్థాయిలో అండర్–14, అండర్–17 బాలికలకు ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 10 మంది విద్యార్థినులు వివిధ క్రీడల్లో జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ఇన్‌చార్జి హెచ్ఎం వనమా రామకృష్ణ తెలిపారు. వీరిలో కె.విన్నీ, కె.పూజిత, ఎ.రేవతి, కె.భార్గవి, కె.స్వాతి అండర్–17లో, నందిని, జి.హాసిని, ఎస్.జ్యోతిరాణిశ్రీ, ఎం.బాల, మనస్విని అండర్–14లో కృష్ణా జిల్లా గుడివాడలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగే జిల్లా స్థాయి వాలీబాల్ సెలక్షన్స్‌లో పాల్గొంటారని చెప్పారు.

బల్లిపర్రు గురుకుల విద్యార్థినుల ఎంపిక

పెడన: నియోజకవర్గ స్థాయిలో బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన వాలీబాల్ అండర్ 14, 17 పోటీల్లో విశేష ప్రతిభ చూపిన పెడన మండలం బల్లిపర్రు ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్. రూతమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాల నుంచి అండర్ 14కు టి. రమ్య, జి. స్వేత, పి. వైష్ణవి, కె. వాసంతి, టి. దీక్షా వర్షిణి, పి. రజిత ఎంపికయ్యారన్నారు. అండర్–17 విభాగంలో సీహెచ్ శిరీష, బి. నవ్య, కె. గంగాభవాని, సీహెచ్ రేణుకా, పీజీవీ ఆలేఖ్య, కె. సుమతి ఎంపికయ్యారని, వీరిని తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు పి. మాధురి, టి. ప్రశాంతిలతో పాటు విద్యార్థినులను అభినందించారు.



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన నాగాయలంక బాలికలు ;



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ రూతమ్మ